

ఆధ్యాత్మిక పరిమళం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈఓ ధర్మారెడ్డి, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.



నేడు గరుడ సేవ

రాపూరు: పెంచలకోనలో బుధవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నారు. రాత్రి బంగారు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు.



అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమావాస్య ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

న్యూస్‌రీల్

ఆలయాల అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి చేయూత

పుంగనూరు : నియోజకవర్గంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేయూతనందించారు. మంగళవారం తన సొంత నిధులు రూ.21లక్షలను ఆయా ఆలయాల అధికారులకు అందజేశారు. వివరాలు.. ఆవులపల్లెలోని సోమేశ్వరస్వామి ఆలయానికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. చౌడేపల్లెలోని అభీష్ట మృత్యుంజయేశ్వరస్వామి గుడికి రూ.58.5లక్షలు, బెస్తపల్లెలోని మాధవరాయస్వామి ఆలయానికి రూ.40.50లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ మొత్తానికి ఆయా ఆలయాల తరఫున కాంట్రిబ్యూషన్ మ్యాచింగ్ గ్రాంట్‌ను చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి సంబంధిత నగదును అందించడం విశేషం.

గజ బీభత్సం.. పంట నష్టం



ధ్వంసమైన మామిడి చెట్లు

ఐరాల: మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. వినాయకపురం, బసివిరెడ్డిఇండ్లులో సోమవారం రాత్రి మామిడి, వరి పంటలపై నాలుగు ఏనుగులు దాడి చేశాయి. రైతు హరిరెడ్డికి చెందిన మామిడి తోట ఫెన్సింగ్ ధ్వంసం చేశాయి. మామిడి చెట్లను విరిచేశాయి. అపోలో చైర్మన్ ప్రతాప్.సి.రెడ్డికి చెందిన మామిడి తోటలో సుమారు 70 చెట్లను నాశనం చేసేశాయి. ఉసిరి, కొబ్బరి చెట్లను నేల కూల్చేశాయి. రైతు చిట్టిబాబు పొలంలో వరిపైరును ఆరగించాయి. సుమారు రూ.5లక్షల పంట నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి జయశంకర్ మామిడి, వరి పంటలను పరిశీలించారు.

బైరెడ్డిపల్లె : మండలంలోని బాపలనత్తంలోని పంట పొలాల్లో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించాయి. కృష్ణమనాయుడు, నారాయణగౌడ్, వెంకటరమణ, రామకృష్ణప్పకు చెందిన వరి, రాగి, టమాట, అరటి పంటలను నాశనం చేశాయి.

తప్పులు లేకుండా రీసర్వే




రీసర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

బంగారుపాళెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీ సర్వేలో తప్పులకు తావులేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని నూనెగుండ్లపల్లెలో నిర్వహించిన రీ సర్వేను జేసీ వెంకటేశ్వర్‌తో కలసి ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వే చేసిన తర్వాత పకడ్బందీగా హద్దు రాళ్లు నాటించాలని సూచించారు. ప్రభుత్వ భూములు, పట్టా భూములకు వేర్వేరుగా రాళ్లు నాటేలా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీ సర్వేకి సంబంధించిన బిల్లులను వెంటనే సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజ్ పాల్గొన్నారు.

పలమనేరు : మండలంలోని ఎస్‌ఆర్‌పురంలో సాగుతున్న భూముల రీసర్వేను కలెక్టర్ హరినారాయణన్ తనిఖీ చేశారు. సర్వే రాళ్లు నాటే ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి తప్పులు దొర్లినా సర్వేయర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జేసీ వెంకటేశ్వర్, ఆర్‌డీఓ శివయ్య, తహసీల్దార్ కుప్పుస్వామి ఉన్నారు.

పకడ్బందీగా పోషకాహారం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగశైలజ

చిత్తూరు రూరల్: బాలింతలు, గర్భిణీలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పకడ్బందీగా పోషకాహారం పంపిణీ చేయాలని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ ఆదేశించారు. మంగళవారం కొంగారెడ్డిపల్లిలోని సీడీపీఓ కార్యాలయంలో పోషణ అభియాన్ వారోత్సవాలను ప్రారంభించారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం లక్ష్యాలను క్షేత్రస్థాయికి చేర్చాల్సిన బాధ్యత అంగన్‌వాడీలపై ఉందన్నారు. పౌష్టికాహారం ద్వారా ఒనగూరే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించాలని కోరారు. సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి, నోడల్ ఆఫీసర్ నిర్మల, ఏసీడీపీఓ చంద్రకళ పాల్గొన్నారు.

విశేషశోభ!

తెలుగు ఉగాది పర్వదినం శ్రీశోభకృత్‌నామ సంవత్సరానికి సర్వం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లాలోని ఆలయాలను యంత్రాంగం చూడముచ్చటగా తీర్చిదిద్దింది. అరటి పిలకలు, మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, విద్యుద్దీప కాంతులతో ప్రత్యేక అలంకరణలు చేపట్టింది. ప్రధానంగా పులుపు, వగరు, తీపి, కారం, ఉప్పు, చేదు కలగలిపి షడ్రుచులతో తయారుచేసిన ఉగాది పచ్చడిని ఉదయం నుంచి భక్తులకు పంపిణీ చేయనుంది. అలాగే ప్రముఖ అవధానులు, ఆగమసలహాదారుల ఆధ్వర్యంలో పంచాగశ్రవణాన్ని భక్తులకు విశదీకరించనుంది.



ముస్తాబైన శ్రీవారి ఆలయం

- శ్రీశోభకృత్‌నామ ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం
- సర్వాంగసుందరంగా ముస్తాబైన ఆలయాలు
- పంచాంగశ్రవణం, ఆస్థానానికి ఏర్పాట్లు పూర్తి

సాక్షి, తిరుపతి: తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలకు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. శ్రీ శోభకృత్ నామ సంవత్సర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తిరుమల శ్రీవారి ఆలయం, కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయం, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, అప్పలాయిగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీనివాస మంగాపురంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి, నారాయణవనంలో శ్రీపద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి, నాగలాపురంలోని శ్రీ వేదనారాయణస్వామి ఆలయం, శ్రీ కోదండరామస్వామి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయం వంటి ముఖ్యమైన ఆలయాలతో పాటు.. ప్రతి గ్రామంలోని ఆలయాలన్నింటిలోనూ ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. అందుకోసం ఆలయాలన్నింటినీ సర్వాంగ సుందరంగా అలంకరించారు. పంచాంగశ్రవణం, ఆస్థానం నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఆలయాల్లో వాహనసేవలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించనున్నారు.

మహతిలో ఉగాది ఉత్సవం

టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టులు, సంక్షేమ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. ముందుగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళధ్వని, టీటీడీ ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థవారి వేద పారాయణం నిర్వహించనున్నారు. టీటీడీ ఆగమసలహాదారు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు శ్రీవేదాంతం విష్ణుభట్టాచార్యులు పంచాంగ శ్రవణం చేయనున్నారు. తిరుపతికి చెందిన ప్రముఖ అవధాని శ్రీఆముదాల మురళి అష్టావధానం చేయనున్నారు. అనంతరం టీటీడీ ఉద్యోగుల పిల్లలకు వేషధారణ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి.




ఎండు కొబ్బరి చిప్పల్లో దశావతారం



దేదీప్యమానంగా శ్రీకాళహస్తీశ్వరాలయం





విద్యుత్ వెలుగుల్లో కాణిపాక వరసిద్ధుని ఆలయం

పుంగనూరులో పైపుల పరిశ్రమ



సమావేశంలో మాట్లాడుతున్న కంపెనీ సీఈవో సురేష్‌కండేల్, పక్కన భాస్కర్‌రెడ్డి తదితరులు

- 56 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం
- రూ.165కోట్ల పెట్టుబడి.. 500 మందికి ఉపాధి
- 24 భూమిపూజకు సన్నాహాలు

పుంగనూరు : మండలంలోని ఆరడిగుంటలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం సుమారు 20వేల ఎకరాలను కేటాయించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ముందుగా రూ.165 కోట్లతో ఫెరా అలాయ్ కంపెనీని గ్రౌండ్ చేసేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తి పైపుల కంపెనీ యాజమాన్యంతో చర్చించి, పుంగనూరు నియోజకవర్గంలో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆరడిగుంటలో ఫ్యాక్టరీ నిర్మాణానికి 56 ఎకరాలను కలెక్టర్ కేటాయించారు. అలాగే పరిశ్రమకు అవసరమైన అనుమతులు, రాయితీలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం కంపెనీ సీఈఓ సురేష్ కండేల్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

500 మందికి ఉపాధి

ఫెరా అలాయ్ పైపుల కంపెనీ ద్వారా 500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తుందని సీఈఓ తెలిపారు. పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు ఈ ప్రాంతంలో ఉందన్నారు. రెండేళ్లలో ఫాక్టరీ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.ఈ నెల 24వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చేతులమీదుగా భూమి పూజ చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో కంపెనీ చీఫ్ జీఎం దొరైరాజ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, రాయలసీమ మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్‌షరీఫ్, సచివాలయాల కన్వీనర్ కొత్తపల్లి చెంగారెడ్డి, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి పాల్గొన్నారు.



ఆరడిగుంట వద్ద పరిశ్రమ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పోషకాల 'గోరుముద్ద'



విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, పక్కన మేయర్, కలెక్టర్

- విద్యార్థుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం
- జిల్లాలో రాగిజావ పంపిణీకి శ్రీకారం
- 1,64,051 మంది పిల్లలకు అందించేందుకు చర్యలు



విద్యార్థులకు రాగిజావ తాగిస్తున్న మంత్రి రోజా

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పకడ్బందీ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా జగనన్న గోరుముద్ద పథకం కింద నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ఈ క్రమంలో పిల్లల్లో రక్తహీనత నివారించేందుకు రాగిజావ పంపిణీ చేయాలని నిర్ణయించారు. మంగళవారం తాడేపల్లె నుంచి రాష్ట్ర స్థాయిలో రాగిజావ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కలెక్టర్ హరినారాయణన్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులపాటు రాగిజావ అందిస్తారన్నారు. మేయర్ మాట్లాడుతూ ఇప్పటికే వారానికి 15 వెరైటీలు, ఐదు రోజుల పాటు గుడ్డు, 3 రోజులు చిక్కీ, పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,457 పాఠశాలల్లోని 1,64,051 మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు రాగిజావ పంపిణీ చేసేలా డీఈఓ పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్, సమగ్ర శిక్ష శాఖ సెక్టోరల్ అధికారులు గుణశేఖర్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మనసున్న ముఖ్యమంత్రి జగనన్న

పుత్తూరు రూరల్: మంచి మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. మంగళవారం పుత్తూరు మండలం గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు రాగి జావ పంపిణీని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఓటు హక్కులేని పిల్లల కోసం రూ.వేల కోట్లు వెచ్చిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో మధ్యాహ్న భోజనానికి రూ.450 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం రూ.1,910 కోట్లు ఖర్చు పెడుతున్నామని వెల్లడించారు. రాగిజావ ద్వారా పిల్లలకు ఐరన్, కాల్షియం వంటి పోషకాలు అందుతాయని వివరంచారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాకాలను అందిపుచ్చుకుని విద్యార్థులు చదువులో చక్కగా రాణించాలని కోరారు. ఉన్నతస్థాయికి ఎదిగి జగనన్నకు రిటర్న్ గిఫ్ట్‌గా ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీవైఈఓ రఘురామయ్య, ప్రధానోపాధ్యాయని భారతి, తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీఓ ఇందిర, సర్పంచ్ విరిత, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్ పాల్గొన్నారు.

రాగిజావ చాలా బాగుంది



రాగిజావ చాలా బాగుంది. ఇందులో పోషక విలువు ఉన్నాయని టీచర్లు తెలిపారు. మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతున్నారు. పాఠశాలలో చక్కటి వసతులు కల్పించారు. మా ఆరోగ్యంపై ఇంతటి శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

– ఆర్. సాథియా, విద్యార్థిని, గిరింపేట హైస్కూల్, చిత్తూరు

రుణపడి ఉంటాం



పేద విద్యార్థుల పక్షాన నిలుస్తున్న జగన్ మావయ్యకు ఎప్పుడూ రుణపడి ఉంటాం. గోరుముద్ద పథకం కింద మాకు మంచి ఆహారం అందిస్తున్నారు. ఇప్పుడు రాగిజావను కూడా పంపిణీ చేస్తున్నారు. ఆయన ముందు చూపు వల్లే మేం ఆరోగ్యంగా ఉంటూ.. బాగా చదువుకుంటున్నాం.

– బత్తెమ్మ, విద్యార్థిని, కార్వేటినగరం హైస్కూల్

జిల్లాకు 'పది' ప్రశ్న పత్రాలు



ప్రశ్నపత్రాల పంపిణీని పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు మంగళవారం చిత్తూరుకు చేరాయి. స్ట్రాంగ్ రూములో ప్రశ్నపత్రాలను ముందుగా భద్రపరిచారు. అనంతరం పటిష్ఠ బందోబస్తు నడుమ ఆయా మండలాలకు తరలించారు. ప్రక్రియను డీఆర్‌ఓ రాజశేఖర్, డీఈఓ విజయేంద్రరావు, డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు రాజేంద్ర, సెల్వరాజ్, హసన్‌బాషా పర్యవేక్షించారు.

సమష్టిగా క్షయ నివారణకు కృషి

చిత్తూరు రూరల్: జిల్లాలో టీబీ నివారణకు సమష్టిగా పనిచేయాలని జేసీ వెంకటేశ్వర్ అన్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం అపోలో ఫౌండేషన్ టోటల్ హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో 200 మంది టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. రూ.700 విలువ చేసే నూనె, పప్పు, చిరుధాన్యాలు, పాల పౌడర్, ఆహార వస్తువులను అందజేశారు. అలాగే 600 మంది టీబీ బాధితులను దత్తత తీసుకున్నారు. వీరికి వస్తువుల పంపిణీకి ఏటా రూ. 50 లక్షలు ఖర్చువుతోందని అధికారులు పేర్కొన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ జి.ప్రకాశం, జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు, సిబ్బంది సంతోష్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న జేసీ వెంకటేశ్వర్

ఉగాది పేదల జీవితాల్లో ఆనందాన్ని నింపాలి

తిరుపతి మంగళం: తెలుగు నూతన సంవత్సరాది శ్రీశోభకృత్‌నామసంవత్సర ఉగాది పేదల జీవితాల్లో ఆనందం నింపాలని నేతలు ఆకాంక్షించారు. రైతులు, నిరుపేదలు, సామాన్యులు, కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజల్లో సుఖశాంతులు నింపాలని కోరారు. ప్రతి ఇట్లో అష్టైశ్వర్యాలు తులతూగాలని, సకాలంలో వర్షాలు పడి పంటలు బాగాపండాలని అభిలషించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో వరాలు పూయించాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజలకు వారు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో రాష్ట్ర విద్యుత్, అటవీ భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డెప్యూటీ సీఎం నారాయణస్వామి, పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాజంపేట ఎంపీ వెంకటరెడ్డి మిథున్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆదిమూలం, వరప్రసాద్, కిలివేటి సంజీవయ్య, వెంకటేగౌడ, ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు తదితరులు ఉన్నారు.

అధికారుల శుభాకాంక్షలు

తిరుమల: తెలుగు నూతన సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి , ఈఓ ఏవీ ధర్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పన్ను వసూలు పక్కా!

గ్రామీణ ప్రాంతాల్లో పన్నులను పకడ్బందీగా వసూలు చేస్తున్నారు. పల్లెవాసులు సైతం అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించే దిశగా అడుగులు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 80శాతం పన్నులను వసూలు చేసేశారు. ఈ నెలాఖరులోపు 95శాతం పూర్తి చేసేందుకు అడుగులు వేస్తున్నారు.

- గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్
- జిల్లాలో 80శాతం వరకు పూర్తి
- కార్యదర్శులు పకడ్బందీ చర్యలు



వసంతాపురంలో పన్ను వసూలు చేస్తున్న గ్రామ కార్యదర్శి, సర్పంచ్

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని పంచాయతీల్లో ఇళ్లు, చెరువులు, షాపులు, లైసెన్స్ తదితర పన్నుల వసూలు వేగంగా సాగుతోంది. దీనిపై కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్లను మరింత వేగవంతం చేశారు. గ్రామీణులు బాధ్యతాయుతంగా అధికారులకు సహకరిస్తున్నారు. నిర్లక్ష్యం లేకుండా పన్నులను పక్కాగా చెల్లించేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది.

సమష్టి కృషి

పంచాయతీల ఆదాయం పెంచేందుకు జిల్లా యంత్రాంగం వీడియోకాన్ఫరెన్స్‌ల ద్వారా మండల, గ్రామస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేస్తోంది. వారంలో రెండురోజులపాటు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తోంది.

జిల్లా సమాచారం

మండలాలు :	31
పంచాయతీలు :	697
వసూలు కావాల్సిన పన్నులు :	రూ.24.42 కోట్లు
ఇప్పటి వరకు వసూలైంది :	రూ.19.53 కోట్లు

అలాగే సర్పంచులు, సచివాలయ సిబ్బంది సైతం పన్ను చెల్లింపుపై గ్రామీణులతో ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. జరిమానా లేకుండా పన్ను చెల్లించాలని విన్నవిస్తున్నారు.

మార్పు స్పష్టంగా కనిపిస్తోంది



జిల్లాలో ఇంటి పన్ను, నాన్‌ట్యాక్స్ వసూలు వేగంగా జరుగుతోంది. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మా కృషి ఫలిస్తోంది. గ్రామీణుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. సకాలంలో పన్ను కట్టేస్తున్నారు.

– లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఘన నివాళి



భాస్కర్‌రెడ్డి వర్ధంతిలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం: ఎర్రాతివారిపల్లెలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి 29వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, సమాధి వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలతమ్మ, తల్లి పద్మావతమ్మ, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, కవితమ్మ, వేణుగోపాల్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, ఎంఆర్‌సీ రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు జింకా చలపతి, పృథ్వీరెడ్డి పాల్గొన్నారు. అలాగే జోగివారిపల్లె గ్రామంలో భాస్కర్‌రెడ్డి వర్ధంతిని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు.

అతిగా మద్యం తాగి లారీడ్రైవర్ మృతి

పలమనేరు : పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఓ లారీడ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. తాడేపల్లెకు చెందిన సురేష్(35) అతిగా మద్యం తాగి లారీ నడుపుకుంటూ వచ్చాడు. ఆర్టీఓ కార్యాలయం వద్ద లారీని ఆపి కింద రోడ్డుపై పడిపోయాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

గంగవరం : మండలంలోని మాడి చెరువులో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. చెరువులో పడి నాలుగైదు రోజులు అయినట్లు భావిస్తున్నారు. మృతుడి వయసు సుమారు 40 ఉండవచ్చని, ఒంటిపై గులాబీ రంగు ఫుల్ షర్టు, మెరూన్ బనియన్, షార్ట్ ఉందని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో యువకుడి అరెస్ట్



చౌడేపల్లె: బోయకొండ ఆలయ ఉద్యోగి సుబ్రమణ్యంపై ఫిబ్రవరి 28వ తేదీన దాడికి పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు.. దిగువపల్లె పంచాయతీ దేవిరెడ్డి చెర్వుకు చెందిన జి.రాజశేఖర్ దాడికి పాల్పడినట్లు బాధితుడి చేసిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ ఈబీ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సీఐ వివరాల మేరకు యాదమరి మండలంలో మంగళవారం ఎస్ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 37 మద్యం ప్యాకెట్లు పట్టుబడడంతో పాటు బాలాజి (30)అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, నాగరాజ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించండి

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో జెర్సీ కోడెదూడల పెంపకం లక్ష్యాన్ని అధిగమించాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకట్రావ్ తెలిపారు. మంగళవారం స్థానిక పశుసంతతి అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఆ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పశుసంతతి అభివృద్ధి కేంద్ర డీడీ హనీఫ్, డీఎల్‌డీఏ చైర్మ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

24న డీసీసీబీ మహాజన సభ

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మహాజన సభ ఈనెల 24వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంకు సీఈఓ మనోహర్‌గౌడ్ తెలిపారు. ఈ సభ ఆ రోజు ఉదయం 11 గంటలకు స్థానిక డీసీసీబీ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు బ్యాంకు పాలకవర్గ చైర్మన్, సభ్యులు , సిబ్బంది హాజరుకావాలని కోరారు.

శరవేగంగా ఫీవర్ సర్వే

చిత్తూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా చేసిన ఫీవర్ సర్వే శరవేగంగా కొనసాగుతోంది. ఈనెల 11వతేదీ నుంచి సర్వేను ప్రారంభించారు. ఇప్పటి వరకు 85 శాతం సర్వే పూర్తిచేశారు. మిగిలిన 15 శాతాన్ని బుధవారంలోపు పూర్తిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో వలంటీర్లు ఫీవర్ సర్వేను పూర్తి చేసే పనిలో పడ్డారు. వీడని జ్వరం కేసులను గుర్తిస్తున్నారు. వారికి తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.